www.vaarthavedhikasurya.com

RNI NO: TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

యాదాద్రి భువనగిరి | శుక్రవారం 12, నవంబర్ 2025 | ఎడిటర్ : పోలోజు శ్రీనివాసచారి | సంపుటి : 01 | సంచిక: 201 | పేజీలు: 08 | వెల: 5/



సంగారెడ్డి జిల్లా కంకోల్‌లోని వోక్సెన్ యూనివర్సిటీ విద్యార్థులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫుట్ బాల్ ప్రాక్టీస్ మ్యాచ్. యూనివర్సిటీ ఫుట్ బాల్ స్టేడియంలో విద్యార్థులతో ప్రాక్టీస్ మ్యాచ్ ఆడిన సీఎం

## ప్రశాంతంగా తొలి విడత పోలింగ్

- తొలి విడతలో 84.28 పోలింగ్ నమోదు
- యాదాద్రి జిల్లాలో అత్యధికంగా 92.88 ఓటింగ్
- మూడుచోట్ల లాటరీలో సర్పంచ్ల ఎన్నిక
- తొలివిడతలో కాంగ్రెస్ హవా
- 90శాతం సర్పంచ్ స్థానాల్లో పాగా
- అత్యధిక సీట్లు గెల్చుకున్న కాంగ్రెస్ మద్దతుదారులు



**హైదరాబాద్, డిసెంబర్11 (వార్త వేదిక సూర్య):** స్థానిక ఎన్నికల తొలి విడతలో కాంగ్రెస్ సత్తా చాటింది. అనేక గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాదించారు. దాదాపు 90శాతం స్థానాల్లో విజయ ఢంకా ఎగురేశారు. తెలంగాణలో తొలి విడత పంచాయతీ ఎన్నికల కౌంటింగ్ పక్రియ కొనసాగుతుండగా, కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు అద్భుతమైన విజయాన్ని నమోదు చేసి తమ హవాను చాటారు. మొత్తం 4,231 సర్పంచ్ స్థానాలకు పోలింగ్ జరగ్గా, వెలువడుతున్న తొలి ఫలితాల్లో కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. ఇదిలా ఉండగా.. గురువారం సాయంత్రం సమయానికి వెలువడిన ఫలితాలు ఇలా ఉన్నాయి... కాంగ్రెస్: 1733, బీఆర్ఎస్ 721, బీజేపీ 133 ఇతరులు 311 స్థానాల్లో గెలుపొందారు. 90 శాతం స్థానాల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు విజయం సాధించారు. కాంగ్రెస్ నాయకులు దీనిని ప్రజాపాలనకు ప్రజలు ఇచ్చిన ఆమోదంగా అభివర్ణించారు. పంచాయతీ ఎన్నికలలో భాగంగా తొలి విడత పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. తొలి విడతలో 3,834 సర్పంచ్, 27,628 వార్డ్ మెంబర్ స్థానాలకు పోలింగ్ జరిగింది. సాధారణ ఎన్నికలతో పోల్చితే సర్పంచ్ ఎన్నికల్లో ఓటర్ల నుంచి భారీ స్పందన వచ్చింది. ఒక్కో జిల్లాల్లో రికార్డు స్థాయిలో పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ జరిగిన స్థానాలతో పాటు, ఎన్నికలు ఏకగ్రీవమైన ప్రాంతాల్లోనూ కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులదే పైచేయిగా ఉంది. ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఏకగ్రీవమైన 45 సర్పంచ్ స్థానాల్లో కాంగ్రెస్ ఏకంగా 32 స్థానాలను దక్కించుకుంది. నల్గొండ జిల్లాలో 17, సూర్యాపేట జిల్లాలో 5, యాదాద్రి జిల్లాలో 10 ఏకగ్రీవ స్థానాల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు విజయ డంకా మోగించారు. మొదటి విడతలో 3,834 గ్రామ పంచాయతీలకు పోలింగ్ జరగ్గా, కౌంటింగ్ పక్రియ మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైంది. బ్యాలెట్ పత్రాల లెక్కింపు మ్యాన్యువల్‌గా జరుగుతున్నందున, మేజర్ గ్రామ పంచాయతీల్లో ఫలితాలు వెల్లడికావడానికి కొంత ఆలస్యం అవుతోంది. ఎంత ఆలస్యమైనా ఈరోజే ఉప సర్పంచ్ ఎన్నికను కూడా పూర్తి చేయాలని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. ఈ ఎన్నికల్లో దాదాపు 79.15శాతం పోలింగ్ నమోదైంది. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. గెలుపొందిన అభ్యర్థులు విజయోత్సవాలు నిర్వహించకుండా పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. మొదటి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ దాదాపు ప్రశాంతంగా ముగిసింది.. క్యూ లైన్ లో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నారు అధికారులు.. పోలింగ్ కేంద్రం ఆవరణలో మధ్యాహ్నం 1 గంటలోపు ఉన్న వారికి టోకెన్లు జారీ చేసి ఓటు హక్కు వినియోగించుకునేలా అవకాశం కల్పించారు. పోలింగ్

మిగతా 2లో..



## తొలి విడతలో 90శాతంపైగా కాంగ్రెస్ సర్పంచ్‌లు విజయం..

- ప్రజల మద్దతు అనూహ్యంగా ఉంది
- కాంగ్రెస్ ఘన విజయంపై పిసిసి చీఫ్ హర్షం

**హైదరాబాద్,డిసెంబర్11(వార్త వేదిక సూర్య):** రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచి ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారుల విజయం.. ప్రజల విశ్వాసానికి నిదర్శనమని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.ప్రజాప్రభుత్వం పట్ల ప్రజలు మరోమారు విశ్వాసం ప్రకటించారని అన్నారు. ఇది తమకు ఎంతో స్ఫూర్తిని ఇచ్చిందన్నారు. ఇందుకు ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ ఎన్నికల తొలి విడతలో.. కాంగ్రెస్ మద్దతుదారులైన అభ్యర్థులు ఘన విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో సామాజిక న్యాయం

మిగతా 2లో..

## 17 నుండి 21 వరకు రాష్ట్రపతి పర్యటన

- శీతాకాల విడిది సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు
- అధికారులతో సమీక్షించిన సిఎస్ రామకృష్ణారావు



**హైదరాబాద్,డిసెంబర్11(వార్త వేదిక సూర్య):** శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 17 నుంచి 21 వరకు హైదరాబాద్ రాష్ట్రపతి నిలయంలో బస చేస్తారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలిపారు. ఐదు రోజులపాటు రాష్ట్రంలో రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై గురువారం డా.బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేసి విస్తృత ఏర్పాట్లు చేయాలని సి.ఎస్. ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ విభాగాలు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, రాష్ట్రపతి నిలయం అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలీసు శాఖ తగు భద్రతా, ట్రాఫిక్, బందోబస్త్ ప్రణాళికను రూపొందించాలని, అగ్నిమాపక శాఖ అవసరమైన సిబ్బందితో పాటు తగిన అగ్నిమాపక ఏర్పాట్లు, ఫైర్ టెండర్లను ఏర్పాటు చేయాలని, వైద్య, ఆరోగ్యశాఖ వైద్య బృందాన్ని

మిగతా 2లో..




## నాలుగు రాష్ట్రాల్లో ముగిసిన సర్ ప్రక్రియ

కొన్ని రాష్ట్రాల్లో పొడిగించిన ఎన్నికల సంఘం

**న్యూఢిల్లీ,డిసెంబర్11(వార్త వేదిక సూర్య):** తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి ఎన్నికల సంఘం తాజా అప్‌డేట్ ఇచ్చింది. వీటిలో తమిళనాడు, గుజరాత్, మధ్యప్రదేశ్,

మిగతా 2లో..

## ప్రజాసేవకు అంకితమైన నేత ప్రణబ్ ముఖర్జీ

- జయంతి సందర్భంగా సిఎం రేవంత్ నివాళి



**న్యూఢిల్లీ,డిసెంబర్11(వార్త వేదిక సూర్య):** భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివా ళులర్పించారు. దశాబ్దాల పాటు ప్రజాసేవకు అంకితమైన గొప్ప నాయకుడు ప్రణబ్ ముఖర్జీ.. అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ జయంతి సందర్భంగా.. ఢిల్లీలోని నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి.. ప్రణబ్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా.. ప్రణబ్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డా.మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, గడ్డం వంశీ, అనిల్ కుమార్ యాదవ్, నాయకులు రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'సింగరేణి' బలోపేతానికి సంపూర్ణ సహకారం అందించాలి

- పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

**న్యూఢిల్లీ:** దేశానికి అవసరమైన బొగ్గు ఉత్పత్తిలో(ఏస్సీసీఏల్) ప్రధాన పాత్ర పోషిస్తున్న సింగరేణి సంస్థ (ఏస్సీసీఏల్)బలోపేతానికి సంపూర్ణ సహకారం అందించాల్సిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర



ప్రభుత్వాన్ని కోరారు. సింగరేణి కోల్ బెల్ట్ వేలాది కుటుంబాలకు ముఖ్యమైన జీవనాధారమన్నారు. ఎంపీ రవిచంద్ర రాజ్యసభలో గురువారం జీరో అవర్‌లో సింగరేణి సంస్థకు సంబంధించిన అత్యవసరమైన అంశాలను ప్రస్తావించారు.బొగ్గు ఉత్పత్తి, అనుమతులు, విస్తరణ, ఆర్థిక సుస్థిరత గురించి ఎంపీ రవిచంద్ర సవివరంగా

మిగతా 2లో..




## "డిజిటల్ సేఫ్టీ"లో రోల్ మోడల్‌గా తెలంగాణ

- "విజన్ 2047 డాక్యుమెంట్"లో కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్
- పౌరుల భాగస్వామ్యంతోనే సైబర్ మోసాలకు అడ్డుకట్ట
- "ఎస్‌సీఎస్‌సీ కాంక్లేవ్ 2025"లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**హైదరాబాద్,(వార్త వేదిక సూర్య):** తెలంగాణను "డిజిటల్ సేఫ్టీ"లో దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగానే "తెలంగాణ రైజింగ్ విజన్- 2047" డాక్యుమెంట్ లోనూ కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్‌ను పొందు పర్చా మన్నారు.

మిగతా 2లో..

## కాంగ్రెస్ అగ్రనేతలతో సీఎం రేవంత్ భేటీ

- ఇటీవలి తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌పై వివరణ
- మెస్సీ కార్యక్రమానికి రావాల్సిందిగా ఆహ్వానం



**న్యూఢిల్లీ,డిసెంబర్11(వార్త వేదిక సూర్య):** 'మెస్సీ గోట్ ఇండియా టూర్' కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ఆహ్వానించినట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. దిల్లీ పర్యటన ముగించుకొని హైదరాబాద్ బయలుదేరే ముందు పార్లమెంట్ ఆవరణలో సీఎం మీడియాతో మాట్లాడారు. ఈనెల 13న ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీ హైదరాబాద్ వస్తున్నారు. ఒక ప్రముఖ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హాజరు అవుతున్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నా కాబట్టి నన్ను కూడా ఒక అతిథిగా పిలిచారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ కార్యక్రమానికి ఎలాంటి సంబంధం లేదు. ప్రముఖ క్రీడాకారుడు వస్తున్నారు కాబట్టి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఇస్తున్నాం.

మిగతా 2లో..

## ట్రంప్‌కు ప్రధాని మోడీ ఫోన్

వాణిజ్య సంబంధాలపై చర్చించినట్లు సమాచారం

**న్యూఢిల్లీ,డిసెంబర్11(వార్త వేదిక సూర్య):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు భారత ప్రధాని మోదీ ఫోన్ చేశారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలపై ఇరువురు నేతలూ చర్చించినట్లు తెలుస్తోంది.



రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత పర్యటన తర్వాత.. ట్రంప్‌నకు మోదీ ఫోన్ చేయడంపై సర్వత్రా ఆసక్తి రేపుతోంది. భారత్-అమెరికాల మధ్య వాణిజ్య సంబంధాలు, ప్రపంచ పరిణామాలపై ట్రంప్‌తో మోదీ మాట్లాడినట్లు సమాచారం. అలాగే ఇరుదేశాల వ్యూహాత్మక భాగస్వామ్యంపై కూడా ఇరు నేతలూ చర్చించినట్లు తెలుస్తోంది. వ్యాపారం, సాంకేతికత, రక్షణ, భద్రత రంగాల్లో సహకారంపై సంభాషణ జరిగినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అయితే.. రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత పర్యటన ముగిసిన రోజుల వ్యవధిలోనే మోదీ ట్రంప్‌తో ఫోన్ చేసి మాట్లాడటంపై సర్వత్రా చర్చనీయాంశమైంది.



## ప్రజల్లోకి వెళ్లండి

- గ్రామీణ ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదానికి ధన్యవాదాలు
- గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బిజెపిని అత్యధిక స్థానాల్లో గెలిపించాలి
- ప్రజలు బిజెపి వైపు చూస్తున్నారు
- బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

**హైదరాబాద్,డిసెంబర్11(వార్త వేదిక సూర్య):** పంచాయతీ ఎన్నికల ఫేజ్-1 ఫలితాల్లో భారతీయ జనతా పార్టీకి గ్రామీణ ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదానికి హృదయపూర్వక ధన్యవాదాలు. బిజెపి మంచి విజయం సాధించడం.. గ్రామాల్లో పార్టీ క్రమేణా బలోపేతం అవుతోందని, ప్రజలు బిజెపి వైపు చూస్తున్నారని స్పష్టంగా తెలుస్తోంది. నరేంద్ర మోదీ ప్రభుత్వం గ్రామ పంచా యతీల అభివృద్ధికి కట్టుబడి ఉంది. గ్రామాల్లో కేంద్ర

మిగతా 2లో..

## అనుమానాస్పద 3.02 కోట్ల ఐఆర్‌సీటీసీ ఖాతాల తొలగింపు



రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

**న్యూఢిల్లీ,డిసెంబర్11 (వార్త వేదిక సూర్య):** తత్కాల్ టికెట్ల జారీ విషయంలో ఇటీవల అనేక మార్పులకు శ్రీకారం చుట్టిన కేంద్ర ప్రభుత్వం.. ఐఆర్‌సీటీసీ ఖాతాల ఏరివేతనూ అదే స్థాయిలో చేపట్టింది. ఇందులో భాగంగా ఈ ఏడాదిలో జనవరి నుంచి ఇప్పటి వరకు 3.02 కోట్ల అనుమానాస్పద యూజర్ ఐడీలను డీయాక్టివేట్ చేసినట్లు రైల్వే శాఖ మంత్రి అశ్విని

మిగతా 2లో..






## కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులను గెలిపించండి : బీర్ల అయిలయ్య

**మోటకొండూరు, డిసెంబర్ 11 (వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి, కదిరేణిగూడెం గ్రామాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రచారంలో పాల్గొన్నారు..ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యేగా నాకు జోడుగా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులను గెలిపిస్తే ఎద్దుల బండి లాగా ముందుకు వెళ్లి నిధులు తెచ్చి గ్రామాల అభివృద్ధి చేస్తామని తెలిపారు.. గతంలో కేసీఆర్ ప్రభుత్వం అందించిన చీరలు బావిల వద్ద, గడ్డి మోపులకు,పంట బెదురుకు వాడుకున్నారని..కానీ ఇప్పుడు ప్రజాపాలన లో ఇచ్చిన ఈ చీర గ్రామాల్లో ప్రతి ఒక్కరు కట్టుకుంటున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో కాటేపల్లి కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి పచ్చిమట్ల జయమ్మ మధార్ గౌడ్, కదిరేణిగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి పైల్ల మమత ఇంద్ర రెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గంగాపురం మల్లేష్ , మచ్చగిరి ఆయా గ్రామాల కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా..

### ధర్మారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ బిఆర్ఎస్ అభ్యర్థి సామ రవీందర్ రెడ్డి

**భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 11(వార్త వేదిక సూర్య):** ప్రజలు ఆశీర్వదించి, ఓటు వేసి గెలిపిస్తే గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతానని ధర్మారెడ్డి పల్లి గ్రామ సర్పంచ్ బిఆర్ఎస్ అభ్యర్థి సామ రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం భూదాన్ పోచంపల్లి మండలం ధర్మా రెడ్డిపల్లి



గ్రామపంచాయతీ పరిధిలోని సల్లోనిగూడెంలో ఇంటింటికి ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా తగిన చర్యలు తీసుకుంటాన ని, మరోసారి అవకాశం కల్పిస్తే గ్రామాన్ని ఉత్తమ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సామజంగారెడ్డి,సూర్వి కాటంరాజు , కళ్లెం జంగారెడ్డి, పడమటి బుచ్చిరెడ్డి, మేకల బాల్ రెడ్డి, బాణాల సత్తిరెడ్డి, కాటేపల్లి బుచ్చయ్య గౌడ్, వార్డ్ మెంబర్లు, పార్టీ శ్రేణులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమ నేత డాక్టర్ అశోక్‌ని పరామర్శించిన ఎమ్మెల్యే వేముల వీరేశం


**రామన్నపేట, డిసెంబర్ 11 (వార్త వేదిక సూర్య):** తెలంగాణ ఉద్యమ నాయకుడు డాక్టర్ ఎన్ అశోక్ తల్లి మరణించిన విషయం తెలుసుకున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం డాక్టర్ అశోక్ ఇంటికి వచ్చి పరామర్శించి ప్రగాఢ సానుభూతి



తెలియజేశారు. భుజం తట్టి ధైర్యం చెప్పి ఓదార్చారు. కుటుంబ విషయాలు అడిగి తెలుసుకుని ఎల్లప్పుడూ అండగా ఉంటానని ధైర్యం చెప్పారు .ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కూరెళ్ళ నరసింహ చారి. తాళ్లపల్లి సత్తిరెడ్డి. పున్న నరసింహ. మాజీ ఎంపీటీసీలు తిమ్మాపురం మహేందర్ రెడ్డి. తాటిపాముల శేఖర్ గౌడ్ ఎర్రోళ్ల సుక్కమ్మ.. తాటిపాముల లింగస్వామి. తాటిపాముల కిరణ్ గౌడ్. తదితరులు పాల్గొన్నారు.

## తాటిచెట్టు పైనుండి పడి గీత కార్మికుడు మృతి

**మోత్కూరు, డిసెంబర్ 11(వార్తా వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపల్ పరిధిలోని జామచెట్ల బావి గ్రామానికి చెందిన గీత కార్మికుడు గనగాని ఐలేను (53) రోజు మాదిరిగానే గురువారం సాయంత్రం సమయంలో తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు మోకుజారి




పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. తాటి చెట్టు పై నుండి ప్రమాదవశాత్తు ఆకాల మృతి చెందిన ఐలేను కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని గీతా కార్మిక సొసైటీ అధ్యక్షులు బీసు సత్తయ్య, మాజీ అధ్యక్షులు బుర్ర యాదయ్యలు కోరారు.

# ప్రచారంలో దూసుకుపోతున్న పోతున్న కాంగ్రెస్, అభ్యర్థులు

### రెండో వార్డు సభ్యుడి గా గెలిపిస్తే వార్డు అభివృద్ధి చేసి చూపిస్తా

### 2వ వార్డులో విస్తృతంగా ప్రచారం నిర్వహించిన

### రెండవ వార్డు అభ్యర్థి గదగుటి పద్మ మహేందర్ ముదిరాజ్

**మహేశ్వరం, డిసెంబర్ 11 (వార్త వేదిక సూర్య):** రెండో వార్డు సభ్యుడి గా గెలిపిస్తే వార్డు అభివృద్ధి చేసి చూపిస్తానని రెండవ వార్డు అభ్యర్థి గదగుటి పద్మ మహేందర్ ముదిరాజ్ అన్నారు.మహేశ్వరం గ్రామ పంచాయతీలోని రెండవ వార్డు ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని మహేశ్వరం గ్రామపంచాయతీ రెండో వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గద్దకూటి మహేందర్ అన్నారు. ఈ సందర్భంగా గదగుటి పద్మ మహేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం లక్ష్యంగా పనిచేస్తానని ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ, కాలువలు, తాగునీటి సౌకర్యం, సిసి రోడ్లు, అండర్ డ్రైనేజీ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కోసం కృషి చేస్తానని అన్నారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని



అన్నారు. ఆదర్శవంతమైన వార్డును తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని గ్రామ అభివృద్ధి మరింతగా జరుగుతుందని అధిక నిధులు తీసుకొచ్చే రెండవ వార్డు అభివృద్ధి బాటలో నడిపించడానికి నా వంతు కృషి



చేస్తానని మహేందర్ అన్నారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజలకు సేవ చేయడానికి ముందుకు వస్తున్నానని మీ అమూల్యమైన ఓటు గ్యాస్ పొయ్యి పై వేసి ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

# బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి పల్సం రమేష్‌ని గెలిపించాలి

### బీసీ సంక్షేమ సంఘం

### జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

**వలిగొండ, డిసెంబర్ 11(వార్తా వేదిక సూర్య):** బడుగు బలహీన వర్గాలు, ఎస్సీ ,ఎస్టీ, మైనార్టీలు బలపరిచిన బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పలుసం రమేష కత్తెర గుర్తుకు ఓటేస్తే వలిగొండ ప్రజలు గెలుస్తారని ప్రజలే సర్పంచి అవుతారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం సాయంత్రం వలిగొండ రాజీవ్ చౌరస్తాలో జరిగిన సమావేశంలో మాట్లాడారు.వలిగొండలో సర్పంచ్ ఎన్నికలు ఆధిపత్యానికి ఆత్మ గౌరవానికి, ధర్మానికి అధర్మానికి న్యాయానికి అన్యాయానికి మధ్య జరుగుతున్న పోరాటమన్నారు. అధిపత్య పెత్తందారి వర్గానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. వలిగొండలో



భూములు దానం చేశామని పదేపదే తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నారని, వీళ్లకు వందల ఎకరాలు ఎక్కడి నుంచి వచ్చాయని, ఎవరి భూమిని ఎవరికి పంచారని ప్రశ్నించారు. దేవుడు సృష్టించిన భూమి ఎవడి సొత్తు కాదన్నారు. వలిగొండ ప్రజలు ఓటు అనే ఆయుధంతో దొర పెత్తనాన్ని పాతాళానికి తొక్క లని పిలుపునిచ్చారు. వలిగొండలో బిడ్డను సర్పంచ్‌గా గెలిపిస్తే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భువనగిరి ఎమ్మెల్యేగా బీసీ అభ్యర్థిని గెలిపించే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు సాయిని యాదగిరి, మాజీ జెడ్పిటిసి మొగుళ్ల శ్రీనివాస్, సర్పంచ్ అభ్యర్థి పలుసం రమేష్, మాజీ ఎంపీటీసీ ఐటిపాముల జ్యోతి సత్యనారాయణ, సింగిల్ విండో మాజీ చైర్మన్ పబ్బు శ్రీనివాస్ గౌడ్, స్వర్ణకారుల సంఘం జిల్లా అధ్యక్షులు కోడపర్తి బాలరాజు చారి, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అప్రోచ్ యువజన నాయకులు బత్తిని శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలి : ఎమ్మెల్యే సామేల్

**మోత్కూరు, డిసెంబర్ 11 (వార్త వేదిక సూర్య):** మండలంలోని 10 గ్రామపంచాయతీ ఎన్నికల్లో 10కి 10 గ్రామాలల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులనే గెలిపించాలని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ అన్నారు. గురువారం నాడు స్థానిక విశ్రాంతిభవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కొనసాగిస్తూనే రెండేళ్లలలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రధానంగా మహిళలకు ఉచిత బస్సు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, అర్హులైన నిరుపేదలందరికీ రేషన్ కార్డులు అందించడంతోపాటు దేశంలో ఎక్కలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో రేషన్ దుకాణాలలో సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. బునాధి కాల్వ దాదాపు పూర్తి కావొస్తుందని ... అది పూర్తయినట్లయితే బీబీనగర్ మండలం మక్తా అనంతారం నుంచి ధర్మారం గ్రామం వరకు ఆయకట్ట రైతులకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో 9 మండలాలు ఉండగా 7 మండలాలలో నేడు స్థానిక ఎన్నికలు జరిగాయని , ఆయా మండలాలలో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలనే గెల్చుకుంటుందని సామేల్ ధీమా వ్యక్తం చేశారు .

అనంతరం మండలంలోని 10 గ్రామ పంచాయతీల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఎమ్మెల్యే ప్రకటించారు. గుండుయాదగిరి (దత్తప్పగూడెం ). యాస నర్సిరెడ్డి ( పాలడుగు) బీసు వెంకటయ్య (అనాజిపురం ) జిట్టా సైదులు (పొడిచేడు ) కర్నె జ్యోతి బివీరేశం



(దాచారం) బండా రమాదేవి (పాటిమట్ల) వర్రే హరిప్రసాద్ (సదర్శాపురం) పైళ్ల నర్సిరెడ్డి (ముషిపట్ల) నకిరేకంటి సైదమ్మబిబి నర్సయ్య ( పనకబండ ) గంట పద్మబిబివెంకట్ రెడ్డి (రాగిబావి)లను బలపరిచినట్లు తెలిపారు. ఆయా గ్రామాలలో గ్రామాలలో పోటీ చేస్తున్న అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. మండలంలోని కొన్ని గ్రామాలలో పార్టీ నిర్ణయించిన అభ్యర్థులు కాకుండా వారికి వ్యతిరేకంగా పనిచేస్తూ తన, ముఖ్యమంత్రి చిత్రాలు పెట్టి ప్రచారాలు చేసినట్లయితే అట్టి వ్యక్తులపై కాంగ్రెస్ పార్టీ నుంచి క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు ఈ సమావేశంలో ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరి రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు పైళ్ళ సోమిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రం లక్ష్మీనర్సింహ్మా రెడ్డి ,అవిశెట్టి అవిలిమల్లు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వంగాల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు గుండగోని రామచంద్రు గౌడ్, మహిళా కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షురాలు ముద్దం జయశ్రీ, అన్నెపు పద్మ,యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి మందుల సురేష్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా నాయకులు కూరెళ్ళ శ్రీరాములు, పల్లె భిక్షం, యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు మెంటనగేష్, మండల నాయకులు బయ్యని రాజు,ఎడ్ల భగవంత్, ముక్కేర్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## కిక్ బాక్సింగ్‌లో మెరిసిన రంగారెడ్డి జిల్లా ప్రతిభా క్రీడాకారులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చేతుల మీదుగా సన్మానం

**మైలర్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 11(వార్తా వేదిక సూర్య):** తెలంగాణ స్టేట్ ఓపెన్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో రంగారెడ్డి జిల్లా క్రీడాకారులు అదరగొట్టారు. ఈ పోటీల్లో హారిక (–42kg) అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 2 గోల్డ్ మెడల్స్ సాధించి, రాబోయే వెస్ట్ జోనల్ కేలో ఇండియా కిక్ బాక్సింగ్ టోర్నమెంట్ 2025కు ఎంపికైంది.



అలాగే పూజారి గౌరీ (–28kg) 3 సిల్వర్ మెడల్స్, పి. అఖిల్ (–42kg) 1 సిల్వర్ & 1 బ్రాంజ్ మెడల్ సాధించి, వాక్కు ఇండియా ఓపెన్ ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ 2026, ఢిల్లీలో జరిగే ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌కు అర్హత పొందారు. క్రీడాకారులను తీర్చిదిద్దడంలో తెలంగాణ స్టేట్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మహిపాల్ సార్, రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రటరీ & కోచ్ నర్సింగ్ రావు సార్ కీలకంగా సహకరించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. స్థానిక ప్రతిభను గుర్తిస్తూ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ క్రీడాకారులను ప్రత్యేకంగా పిలిచి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సోమ శ్రీనివాస్, సందుల హనుమంత్, రాయుడు, నర్సింహా, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.



## ఉంగరం గుర్తుకు ఓటు వేసి పట్టం కట్టేందుకు సిద్ధమైన జనం

**రామన్నపేట, డిసెంబర్ 11(వార్తా వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని గోపరాజుపల్లి గ్రామంలో బిఆర్ఎస్ సర్పంచి అభ్యర్థి నీలం నరేందర్ గెలుపు కొరకు గురువారం ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి



ముఖ్య అతిథిగా పాల్గొన్న బిఆర్ఎస్ జిల్లా నాయకులు, మాజీ జడ్పిటిసి మొగుళ్ళ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ అభ్యర్థి నీలం నరేందర్ ఉంగరం గుర్తుపై ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారని అన్నారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిందని నేటికీ హామీలను అమలు చేయలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు కళ్లెం మారయ్య, గాజుల అంజయ్య, గుండు స్వామి, సంగిశెట్టి చంద్రయ్య, ఉంద్ర భగవంత రెడ్డి, రావుల ధర్మయ్య, వల్లమాల పెంటయ్య, సంగిశెట్టి మాణిక్యం, నర్సయ్య ,రావుల సుధాకర్ రాజు,వల్లమాల స్వామి ఢిల్లీ , రాజు,మత్స్యగిరి, సైదులు, సంగపాక స్వామి, ఎర్ర శ్రీను, గోసుల జగన్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.





# మణికొండ-నెక్నాంపూర్ డీలిమిటేషన్‌లో పారదర్శకత లేకుండా తీసుకున్న నిర్ణయాలపై ప్రజల ఆవేదన

**అశాస్త్రీయ డీలిమిటేషన్‌ను రద్దు చేసి పునఃపరిశీలించాలంటూ డిమాండ్**

మైలర్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 11 (వార్త వేదిక సూర్య): 2019 వరకు పంచాయతీలుగా ఉన్న మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్ గ్రామాలు ప్రజల సూచనలతో మణికొండ మున్సిపాలిటీలో విలీనం అయ్యాయి. అయితే తొలి మున్సిపల్ కౌన్సిల్ పదవీకాలం 26 జనవరి 2024తో ముగిసిన అనంతరం, ప్రత్యేక అధికారి పాలనలో ప్రభుత్వం "తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్" పేరిట జీహెచ్ఎంసీ విస్తరణపై ప్రకటించిన విధానానికి విరుద్ధంగా అధికారులు 7 కార్పొరేషన్లు, 20 కౌన్సిల్ళ్ను జీహెచ్ఎంసీలో విలీనం చేసే చర్యలు చేపట్టడం స్థానిక ప్రజల్లో తీవ్ర అసంతృప్తి కలిగించింది. పట్టణ పరిమితుల మార్పు, విస్తరణ వంటి కీలక నిర్ణయాలకు ముందు పౌరులకు ముందస్తు సమాచారం ఇవ్వడం, ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం చట్టపరంగా తప్పనిసరి. కానీ ప్రస్తుత విలీన ప్రక్రియలో పౌరుల సూచనలు, అభ్యంతరాలను స్వీకరించే అవకాశం ఇవ్వకపోవడం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధం. డీలిమిటేషన్ ప్రక్రియలో సమీపత, కాంపాక్ట్ నెస్, జనాభా సమానత్వం, పరిపాలనా సౌలభ్యం వంటి ప్రమాణాలను పాటించకుండా వార్డుల పునర్విభజన జరగడం అశాస్త్రీయమని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేగంగా అభివృద్ధి చెందిన మణికొండలో కనీసం నాలుగు వార్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ, కేవలం రెండు వార్డులకు మాత్రమే పరిమితం చేయడం పరిపాలనా రీత్యా అన్యాయమని వారు పేర్కొన్నారు. భిన్న ప్రాంతాలను కలిపి అతి పెద్ద వార్డులుగా మార్చడం స్థానిక స్వపరిపాలనను బలహీనపరిచి, ఎన్నికయ్యే ప్రజాప్రతినిధుల ప్రాప్యతను తగ్గిస్తుందని భావిస్తున్నారు. అంతేకాక ప్రస్తుత విలీన ప్రతిపాదన రాజ్యాంగ 73వ, 74వ సవరణలు మరియు జి హెచ్ ఎం సి చట్టం 1955లోని సెక్షన్ 3 & 4 నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు తెలిపారు. మణికొండ-నెక్నాంపూర్ డీలిమిటేషన్‌ను వెంటనే పునః పరిశీలించాలి. అర్థవంతమైన ప్రజా సంప్రదింపులు నిర్వహిస్తూ పౌరుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలి. తుది వార్డు నిర్మాణం జనాభా పెరుగుదల, పరిపాలనా సామర్థ్యం, వికేంద్రీకరణ సూత్రాలను ప్రతిబింబించాలి. పారదర్శకత, చట్టబద్ధతతో విలీన ప్రక్రియను పునఃస్థాపించాలి. ఈ మేరకు సీతారం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, బొమ్ము ఉపేందర్నాథ్ రెడ్డి, అందె లక్ష్మణ్ రావు, షేక్ ఆరిఫ్ మొహమ్మద్ భాను చందర్, ఆశ్ఫాక్ అలీ తదితరులు తమ అభ్యంతరాలను అధికారులకు సమర్పించారు.



# భవాని కాలనీ-ప్రేమవతిపేటలను మైలార్దేవ్పల్లి డివిజన్లోనే ఉంచాలని డిమాండ్

**- గోద పాండు యాదవ్**

మైలర్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 11 (వార్త వేదిక సూర్య): భవాని కాలనీ, ప్రేమవతిపేటలను మైలార్దేవ్పల్లి డివిజన్‌లోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ డివిజన్ బీజేపీ అధ్యక్షులు గోద పాండు యాదవ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ మైనారిటీ ఓట్లను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాంతాలను కాటేదాన్ డివిజన్ కి చేర్చిందని ఆయన ఆరోపించారు. పాండు యాదవ్ మాట్లాడుతూ... "ప్రజల అభిరుచి, భౌగోళిక పరిస్థితులు స్పష్టంగా మైలార్దేవ్పల్లి డివిజన్కే అనుకూలం. అయినప్పటికీ కాంగ్రెస్ రాజకీయ లాభం కోసం భవాని కాలనీ, ప్రేమవతిపేటలను అనవసరంగా కాటేదాన్ డివిజన్లోలో విలీనం చేసింది. ఇది ప్రజలకు అన్యాయం" అన్నారు.

అతను కాటేదాన్ డివిజన్ పరిధిలో వచ్చే ప్రాంతాల వివరాలు వెల్లడించారు. కాటేదాన్ డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్, సాయిబాబా నగర్, నేతాజీ నగర్, శ్రీరామ్ నగర్, వెంకటేశ్వర కాలనీ, బుద్వేల్ రైల్వే స్టేషన్ పరిసరాలు, మైలార్దేవ్పల్లి విలేజ్, ప్రగతి కాలనీ, బృందావన్ కాలనీ, టాటా నగర్, మైలార్దేవ్పల్లి రైల్వే గేట్ నియర్ ప్రాంతం, అలీ నగర్, నూరి స్మశాన ఘాట్ వరకు. అలాగే శివరాంపల్లి రైల్వే ట్రాక్ నుంచి మైలార్దేవ్పల్లి రైల్వే ట్రాక్, అలీ నగర్, బండ్లగూడ పోలీస్ స్టేషన్ వెనుక వైపు రైల్వే ట్రాక్ వరకు కూడ ఈ డివిజన్ పరిధిలోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయంపై వెంటనే పునర్విచారణ చేసి భవాని కాలనీ ప్రేమవతిపేటలను తిరిగి మైలార్దేవ్పల్లి డివిజన్లో చేర్చాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# గెలుపే లక్ష్యంతో ముందుకు పోతున్న గోవిందపురం గ్రామ సర్పంచ్ అభ్యర్థి బుర్రు అనిల్ కుమార్

**బ్యాట్ గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించండి.**

**చదువుకున్న యువకుడికి పట్టం కట్టాలని విజ్ఞప్తి**

అడ్డగూడూర్, డిసెంబర్ 11 (వార్త వేదిక సూర్య): గోవిందపురం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న యువకుడు ప్రచారం మొదలుపెట్టి గడప గడప కు తిరిగి ప్రజలను ఓట్ అభ్యర్థించడం జరిగింది.

ఈ సందర్భంగా గోవిందపురం సర్పంచ్ అభ్యర్థి బుర్రు అనిల్ కుమార్ మాట్లాడుతూ గోవిందపురం గ్రామంలో అనేక సమస్యలపై పోరాటాలు చేసి సమస్యలను పరిష్కరించిన ఘనత నాదేనాని అన్నారు గ్రామంలో అనేక మందికి సీఎం ఆర్ ఎఫ్ చెక్కులు ఇప్పించి ఆదుకోవడం జరిగింది అదే విధంగా అనేక మందికి కళ్యాణ లక్ష్మీ అసటగా నిరుపేద కుటుంబలకు అండగా నిలబడి మనోధైర్యం కలిపించడం జరిగింది ఈ సారి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలిపిస్తే నిరుపేద కుటుంబలకు అండగా నిలబడి సేవాకుడిగా పని చేస్తా అన్ని అన్నారు.అదే విదంగా నిరరంతరం మీకు అందుబాటులో ఉండి గ్రామని అభివృద్ధి చేస్తా అన్ని అన్నారు.



ఈ కార్యక్రమంలో గోవిందపురం గ్రామ ప్రజలు పడిశాల పాపయ్య, బుర్రు సునీల్,తోటకూర చింటూ, మధు,బుర్రు కీర్తన, ఇంద్రమ్మ, మరియమ్మ,తదితరులు పాల్గొన్నారు.




# గ్లోబల్ సమ్మెట్ ద్వారా వేల కోట్ల పెట్టుబడులు : మిద్దెల జితేందర్

ఎల్ బి నగర్, డిసెంబర్ 11(వార్త వేదిక సూర్య): కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రత్మకంగా ఫీచర్ సిటీ గ్లోబల్ సమ్మెట్ ను ఏర్పాటు చేసి వేలకోట్ల రూపాయలు పెట్టుబడును ఫీచర్ సిటీకి తీసుకు రావడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దురదృష్టకి నిదర్శనమని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ అన్నారు. గురువారం సేవాదళ్ ప్రతినిధులతో కలిసి ఫ్యూచర్ సిటీ గ్లోబల్ సమ్మిట్ ను సందర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి ఫీచర్ సిటీ అనే కొత్త నగరాన్ని అభివృద్ధి చేసి ప్రపంచ పెట్టుబడులు మల్లించే విధముగా కృషిచేస్తున్నారు అని కొనియాడారు. ఈ కార్యక్రమం లో సేవాదల్ జనరల్ సెక్రటరీ బండి సురేందర్, గాంధీ భవన్ ఇంచార్జ్ ఎల్ బి నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు పల్లె అజయ్ కుమార్, కొత్తపేట డివిజన్ సేవాదల్ అధ్యక్షులు యూసుఫ్, కొత్తపేట డివిజన్ సేవాదల్ జనరల్ సెక్రటరీ ఇటుకల నగేష్, మహేశ్వరం నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షులు హరి పాల్గొన్నారు.

# మంగళపల్లి పల్ల శంకర్ జ్ఞాపకార్థం చెట్టుపల్లి ఉప్పలయ్య కుటుంబానికి 25కేజీల బియ్యం అందజేత

తొర్రూరు, డిసెంబర్ 11(వార్తా వేదిక సూర్య): తొర్రూరు పట్టణకేంద్రంలోని అంబెద్కర్ నగర్ కి చెందిన చెట్టుపల్లి ఉప్పలయ్య(70) ఇటీవల అనారోగ్యంతో మరణించారు కాలనిలో మరణించిన పేద కుటుంబాలకు సహాయార్థంలో భాగంగా ఈరోజు చెట్టుపల్లి ఉప్పలయ్య (70) కుటుంబానికి ఎంపీఎస్ మెమోరియల్ (మంగళపల్లి పల్ల శంకర్ జ్ఞాపకార్థం) ద్వారా 25 కేజీల బియ్యం అందజేసిన మంగళపల్లి నాగరాజు .ఈ కార్యక్రమంలో దొడ్డికాడి చంద్రయ్య,వీరయ్య,శ్రీను, చెట్టుపల్లి యాకయ్య, లింగయ్య, సోమయ్య, మంగళపల్లి రాజు, శ్రీకాంత్, ప్రకాష్ ,జెల్ల ఉపేందర్ మరియు కుటుంబ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.





# ఉత్తమ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుతా..

**దంతూరు గ్రామ సర్పంచ్ బిఆర్ఎస్ అభ్యర్థి బత్తుల మాధవి శ్రీశైలం గౌడ్**

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 11 (వార్త వేదిక సూర్య): తనను ఆశీర్వదించి గెలిపిస్తే గ్రామాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దుతానని దంతూరు గ్రామ సర్పంచ్ బిఆర్ఎస్ అభ్యర్థి బత్తుల మాధవి శ్రీశైలం గౌడ్ అన్నారు . గురువారం భూదాన్ పోచంపల్లి మండలం దంతూరు గ్రామంలో కత్తెర గుర్తుకు ఓటు వేయాలని కరపత్రాలు చూపిస్తూ ఓటర్లను అభ్యర్థించారు. ఇంటింటికి ఎన్నికల ప్రచారం విస్తృతంగా చేశారు. ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి జిల్లాలోనే ఆదర్శంగా తీర్చి దిద్దుతానని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా తగిన చర్యలు చేపడతానని, ప్రజలందరి సహకారంతో గ్రామ అభివృద్ధికి తోడ్పడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంబాలపల్లి సత్తయ్య, బోదాసు బాలరాజు, సిద్ధగోని వెంకటేశం, పాక నరసింహ జాల శ్రీశైలం, గంగ దారి మురళీకృష్ణ, బింగి శివ , సిద్ధగో ని లింగస్వామి, సిద్ధగో ని సైదులు, సిద్ధగోని లింగస్వామి, మా కోలు రాజు, పార్టీ శ్రేణులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి నా లక్ష్యం... ఆశీర్వదించి... ఓటు వేయండి..

**ధోతి గూడెం గ్రామ సర్పంచ్ ఇండిపెండెంట్ అభ్యర్థి ముద్దం సత్యం యాదవ్**

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 11 (వార్త వేదిక సూర్య): గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే నా లక్ష్యమని , ప్రజలందరూ ఆశీర్వదించి ఓటు వేసి గెలిపించాలని ధోతి గూడెం గ్రామ సర్పంచ్ ఇండిపెండెంట్ అభ్యర్థి ముద్దం సత్యం యాదవ్ కోరారు. గురువారం భూదాన్ పోచంపల్లి మండలం ధోతి గూడెం గ్రామంలో ఇంటింటి ప్రచారం విస్తృతంగా నిర్వహించారు. బ్యాట్ గుర్తుకు ఓటు వేయాలని బ్యాలెట్ పేపర్లను చూపిస్తూ ప్రచారం చేశారు. నిజాయితీగా పని చేస్తానని, పేద ప్రజలకు అండగా నిలుస్తానని అన్నారు.విద్యావంతుడిగా గ్రామ అభివృద్ధి కోసం సర్పంచ్ బరిలో ఉన్నానని, ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. జిల్లాలోనే దోతి గూడెం గ్రామాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దుతానని అన్నారు.






# 13న నవోదయ ప్రవేశ పరీక్ష



మోత్కూరు,డిసెంబర్ 11(వార్తా వేదిక సూర్య): 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశం కొరకు నిర్వహించే నవోదయ ప్రవేశ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయినట్లు మండల విద్యాధికారి (ఎం.ఈ.ఓ) తీపిరెడ్డి గోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం గోపాల్ రెడ్డి విలేఖరులతో మాట్లాడుతూ ఉదయం 11.30 నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు పరీక్ష వ్రాసే విద్యార్థులు గంట ముందుగా (ఉదయం 10 గంటలకే ) పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కోరారు.

# అభివృద్ధి చేస్తా..... ఆశీర్వదించండి

మోత్కూరు: డిసెంబర్ 11 (వార్త వేదిక సూర్య): మోత్కూరు మండలం పనకబండ గ్రామంలో బిజెపి బలపర్చిన బి ఆర్.ఎస్.సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న లోతుకుంట రేణుక బిబి అనిల్ ఇంటింటికి తిరిగి తనను గెలిపిస్తే పనకబండ గ్రామాన్ని అన్ని రంగాలుగా అభివృద్ధి చేస్తానని తనను ఆశీర్వదించాలని ప్రజలను





కోరారు. గురువారం నాడు పనకబండ లో బిజెపి, బి.ఆర్.ఎస్ సహాకారంతో ప్రజలతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు.

# వార్డు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తా ..

**స్టూల్ గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించండి కాంగ్రెస్ అభ్యర్థి : పుట్లగారి చందు**

మహేశ్వరం (వార్త వేదిక సూర్య): మహేశ్వరం గ్రామ పంచాయతీ 14 వార్డు ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని మహేశ్వరం గ్రామపంచాయతీ 14 వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పుట్ల గారు చందు తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో అభివృద్ధి లక్ష్యంగా





పనిచేస్తానని ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ. కాలువలు, తాగునీటి సౌకర్యం. సిసి రోడ్లు. అండర్ డ్రైనేజీ. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కోసం కృషి చేస్తానని అన్నారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ఆదర్శవంతమైన వార్డును తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని గ్రామ అభివృద్ధి, అధిక నిధులు తీసుకొచ్చే 14 వార్డు అభివృద్ధి బాటలో నడిపించడానికి నా వంతు కృషి చేస్తానని పుట్లగారి చందు, అన్నారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజలకు సేవ చేయడానికి ముందుకు వస్తున్నానని మీ అమూల్యమైన ఓటు స్టూల్ గుర్తుపై వేసి ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ గంటి ఆకాష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.





# జిల్లాలో ఓటింగ్ ప్రశాంతంగా సాగుతోంది : జిల్లా కలెక్టర్

## పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ,డిసెంబర్ 11 (వార్త వేదిక సూర్య): మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ లో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ జిల్లాలో మొదటి విడత ఎన్నికలు జరుగుతున్న నల్గొండ, చండూరు డివిజన్లలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పోలింగ్ సరళిని, ఓటర్లు ఓటు వేసేందుకు చేసిన ఏర్పాట్లు ,పోలింగ్ కేంద్రాల పరిధిలో పరిస్థితులు ,శాంతి భద్రతలు తదితర అంశాలను పరిశీలించారు. ముందుగా జిల్లా కలెక్టర్ తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఉదయం 7 గంటలకే మాక్ పోలింగ్ తో పోలింగ్ ప్రారంభం కాగా, జిల్లా కలెక్టర్ పోలింగ్ కేంద్రానికి చేరుకునే వరకే ఓటర్లు క్యూ లైన్లలో నిలబడి ఓటు హక్కు వినియోగించుకోవడం గమనించారు. తర్వాత జిల్లా కలెక్టర్ తిప్పర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని సైతం సందర్శించి అక్కడ ఏర్పాట్లను, పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా ఉదయం 7



గంటలకే మొదటి విడత ఏన్నికలు జరిగే అన్ని పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రారంభమైందని, ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకుంటున్నారని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ పూర్తయిన తర్వాత మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్ల లెక్కింపు మొదలవుతుందని, ముందుగా ఆయా వార్డుల ఓట్ల లెక్కింపు చేపట్టి అనంతరం సర్పంచ్ ఎన్నిక చేపట్టడం జరుగుతుందన్నారు.ఆ తర్వాత ఉపసర్పంచ్ ఎన్నికను పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పోలింగ్ కేంద్రాలలో ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లతో ముఖాముఖి మాట్లాడారు. అక్కడున్న సౌకర్యాలు, ఇతర వివరాలను అడిగారు. ఎన్నికల కమిషన్ అనుమతించిన 18 ధ్రువపత్రాలలో ఏదో ఒక గుర్తింపు కార్డును చూపించి ఓటును వేయవచ్చని ఆమె సూచించారు. పోలింగ్ కేంద్రంలోకి ఎలాంటి పేపర్లు, వాటర్ బాటిల్స్ వంటివి తీసుకువెళ్లకూడదని ఓటర్లకు తెలియజేశారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలింగ్ సిబ్బందికి ,పోలీస్ సిబ్బందికి అప్రమత్తతను జారీ చేశారు. జిల్లా కలెక్టర్ వెంట నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జెడ్పి సీఈవో శ్రీనివాసరావు, తిప్పర్తి తహసిల్దార్ ,ఎంపీడీవో, తదితరులు ఉన్నారు.







# ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా చేయాలి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ,డిసెంబర్ 11 (వార్త వేదిక సూర్య): గ్రామపంచాయతీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం ఆమె కనగల్ మండలం జి. ఎడవెల్లి ,ఇస్లాం నగర్ గ్రామంలో పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.ఓటింగ్ జరిగిన విధానం తెలుసుకొని కౌంటింగ్ ప్రక్రియ కూడా పూర్తిగా ఎలాంటి తప్పులు లేకుండా చేయాలని అధికారులకు సూచించారు.


పోలింగ్ అనంతరం కౌంటింగ్ ప్రక్రియలో పాటించవలసిన నిబంధనలు, జాగ్రత్తలు, భద్రతా చర్యలపై అక్కడే విధుల్లో ఉన్న ఎన్నికల సిబ్బంది, పోలీసు అధికారులు, రిటర్నింగ్ ఆఫీసర్లతో మాట్లాడుతూ ఒక అభ్యర్థికి ఒక ఏజెంట్ మాత్రమే లోపలికి అనుమతించాలన్నారు. పోలింగ్ ప్రక్రియ విజయవంతంగా ముగిసిన తర్వాత అసలైన బాధ్యత కౌంటింగ్ దశలో ప్రారంభమవుతుందని, కౌంటింగ్ ప్రక్రియలో జరిగే ప్రతి చర్య ఎన్నికల పారదర్శకతను ప్రతిబింబిస్తుందన్నారు. అందువల్ల ఓట్ల లెక్కింపులో ఏ చిన్న నిర్లక్ష్యం జరగకుండా చూసుకోవాలని బ్యాలెట్ బాక్సులు, కవర్లు, ఫారమ్లు, స్టేట్మెంట్లు అన్నింటిలో జాగ్రత్తగా వ్యవహరించాలని, బ్యాలెట్ల పరిశీలనలో పారదర్శకత అత్యంత ముఖ్యమని బ్యాలెట్ పేపర్ను చెల్లిన ఓటు, చెల్లని ఓటు అని నిర్ణయించే సమయంలో ప్రతీ టేబుల్ వద్ద ఆర్ ఓ మరియు ఎ ఆర్ ఓ మార్గదర్శకాలను కచ్చితంగా అనుసరించాలన్నారు.ఏవైనా అభ్యంతరాలు వచ్చినప్పుడు టేబుల్ సూపర్వైజర్ తక్షణమే ఆర్ ఓ ను సంప్రదించి స్పష్టత తీసుకోవాలని చెప్పారు. అభ్యంతరం వచ్చిన ఓటును ప్రత్యేక కవర్లో



ఉంచి నోటింగ్లు పూర్తి చేయాలన్నారు. ఒక్క చిన్న పొరపాటు తుది ఫలితంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున అత్యంత జాగ్రత్త అవసరమన్నారు. ప్రతి ఓటు ప్రజల నమ్మకానికి ప్రతీక అని,ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కౌంటింగ్ ప్రక్రియను అత్యంత నిజాయితీగా, నిష్పక్షపాతంగా నిర్వహించడం అందరి బాధ్యత అని, ఎవరూ ఒత్తిళ్లకు, ప్రభావాలకు లోనుకావద్దన్నారు.

కౌంటింగ్ వేగంగా జరగడం కంటే ఖచ్చితమైన ఫలితాలు రావడం ప్రధాన లక్ష్యమన్నారు. అందువల్ల ప్రతి టేబుల్ వద్ద సిబ్బంది శ్రద్ధగా ఆతురత లేకుండా పని చేయాలన్నారు. అన్ని ఫారమ్లు, నమోదు పత్రాలు పూర్తిగా తనిఖీ చేసిన తరువాతే రౌండ్ ఫలితాలను ప్రకటించాలని చెప్పారు.

ఫలితాలు పూర్తయిన తర్వాతే ఫామ్- 29 ను గెలిచిన అభ్యర్థికి సర్పంచ్ గా ఇవ్వాలని తెలిపారు. జడ్పీ సీఈవో శ్రీనివాస రావు, నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి ,కనగల్ తహసిల్దార్ పద్మ, ఎంపీడీవో వేద రక్షిత,ఎం పీ ఓ సతీష్ కుమార్, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.





# సిసి టివిల ద్వారా ఎన్నికల పర్యవేక్షణ

నల్లగొండ,డిసెంబర్ 11 (వార్త వేదిక సూర్య): మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు సజావుగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేలా జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేసిన సి సి టి వి ల ద్వారా పరిస్థితులను పర్యవేక్షించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో జిల్లా యంత్రాంగం వెబ్ కాస్టింగ్ విధానాన్ని ఏర్పాటు చేసింది. ముందే గుర్తించిన పోలింగ్ కేంద్రాలన్నిటిలో వెబ్ క్యాస్టింగ్తో పాటు, అవసరమైన చోట సూక్ష్మ పరిశీలకులను సైతం నియమించారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం అయిన వెంటనే పరిస్థితులను ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లోని సీసీటీవీ కెమెరా ల ద్వారా జిల్లాలోని ఆయా పోలింగ్ కేంద్రాలలో పరిస్థితిలను గమనించారు. ఇందుకుగాను ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం ఎప్పటికప్పుడు వెబ్ క్యాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాలలో పరిస్థితులను పరిశీలిస్తూ జిల్లా కలెక్టర్ కు, గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలతరాలు కొర్ర లక్ష్మికి తెలియజేశారు. జిల్లా సాధారణ పరిశీలకురాలు కొర్ర లక్ష్మి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ,జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ,అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ లు సైతం జిల్లా కలెక్టర్ ఛాంబర్ నుండి ఆయా పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ మేరకు ఆయా పోలింగ్



కేంద్రాలలో పరిస్థితిలను గమనించిన అనంతరం సంబంధిత ఆర్టీవోల ద్వారా ఆరోలకు తగు సూచనలను,సలహాలను అందజేశారు. జెడ్పీసీఈఓ శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు జిల్లా సాధారణ పరిశీలకురాలు కోర్రా లక్ష్మి నార్కెట్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ పరిస్థితులను పరిశీలించారు. ఓటర్లు ఓటు వేసేందుకు ఏర్పాటు చేసిన క్యూలైన్లు, బ్యారికేడింగ్, ఇతర సౌకర్యాలు, 100 మీటర్ల పరిధిలో పాటించవలసిన నియమాలు, తదితర అన్నింటిని గమనించారు.







# శివరాంపల్లిని రాజేంద్రనగర్ డివిజన్లోనే కొనసాగించాలి

- కార్పొరేటర్ పొడవు అర్చన జయప్రకాశ్ డిమాండ్

మైలర్దేవ్పల్లి, డిసెంబర్ 11 (వార్త వేదిక సూర్య): శివరాంపల్లి గ్రామాన్ని సులేమాన్ నగర్ డివిజన్లోకి కలపడాన్ని రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ పొడవు అర్చన జయప్రకాశ్ తీవ్రంగా ఖండించారు. ఈ డివిజన్ మార్పు సబబు కాదని ఆమె హెచ్చరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ మాట్లాడుతూ, "గతంలో ఎప్పటిలాగే శివరాంపల్లి గ్రామం రాజేంద్రనగర్ డివిజన్లోనే కొనసాగాలి. ప్రజల అభిరుచికి, సౌకర్యానికి విరుద్ధంగా డివిజన్ మార్పులు చేయడం ఎంతమాత్రం తగదు. పాత డివిజన్లోనే ఉండేందుకు ప్రజలు బలంగా కోరుకుంటున్నారు. అని అన్నారు. ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి, శివరాంపల్లి గ్రామాన్ని పాత డివిజన్ అయిన రాజేంద్రనగర్లోనే కొనసాగించాల్సిందిగా ఆమె సంబంధిత అధికారులను కోరారు. ప్రజాభీష్టం మేరకు తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.



# ఆర్టీఐ కింద సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం

## ఇద్దరు ఐఎఎస్లకు నోటీసులు

హైదరాబాద్,డిసెంబర్11(వార్త వేదిక సూర్య): ఆర్టీఐ చట్టం కింద సమాచారం ఇవ్వలేదంటూ దాఖలైన పిటిషన్పై ఇద్దరు ఐఏఎస్లకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కోర్టు ఆదేశాలు ఉన్నా ఆర్టీఐ చట్టం కింద సమాచారం అందజేయలేదని మాజీ జీహెచ్ఎంసీ కమిషనర్ కె.ఇలంబర్తి, ప్రస్తుత జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్లకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఆర్టీఐ చట్టం ప్రకారం పిటిషనర్ అడిగిన సమాచారం ఇవ్వకపోవడంతో గతంలో సికింద్రాబాద్లోని రాంగోపాల్పేటకు చెందిన వడ్డం శ్యామ్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం వెంటనే అడిగిన సమాచారం ఇవ్వాలని నవంబర్ 24న ఆదేశాలు జారీ చేసింది. అయితే హైకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని శ్యామ్ మరోసారి కోర్ట్ను ఆశ్రయించారు. గురువారం విచారణ జరిపిన ధర్మాసనం.. ఐఏఎస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణ కింద చర్యలు ఎందుకు తీసుకోవద్దో తెలపాలని ఐఏఎస్ అధికారులపై మండిపడింది. కోర్టు ఆదేశాలు ఎందుకు పాటించలేదో వివరిస్తూ జనవరి 26న కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. అంతేకాకుండా కోర్ట్ ఉత్తర్వులు పాటించకపోతే జరిమానా విధిస్తామని ఇద్దరు ఐఏఎస్ అధికారులకు హైకోర్టు ధర్మాసనం హెచ్చరికలు జారీ చేసింది.

# కొండా సురేఖకు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ

హైదరాబాద్,డిసెంబర్11(వార్త వేదిక సూర్య): తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు నాంపల్లిలోని ప్రత్యేకకోర్టు గురువారం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం దావా కేసులో మంత్రి కొండా సురేఖపై ఈ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అనంతరం ఈ కేసు విచారణను వచ్చే ఏడాది ఫిబ్రవరి 5వ తేదీకి నాంపల్లి ప్రత్యేక కోర్టు వాయిదా వేసింది.

# కబ్జా చేసినట్లు రుజువు చేస్తే జైలుకెళతా

## కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హైదరాబాద్,డిసెంబర్11(వార్త వేదిక సూర్య): తాను ఎలాంటి కబ్జాలకు పాల్పడలేదని.. తానేంటో ప్రజలకు తెలుసునని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పష్టం చేశారు. తాను కబ్జాలకు పాల్పడినట్లు వస్తున్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఐడీపీఎల్ భూముల కబ్జాపై తనపై ఇద్దరు నేతలు అసత్య ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. ఆ భూముల్లో నివాసం ఉంటున్న పేదల జోలికి వెళ్తే ఆత్మాహుతి చేసుకుంటానని ఆయన హెచ్చరించారు. ఆ భూముల్లో తాను గజం జాగా కబ్జా చేశానని నిరూపిస్తే.. తాను జైలుకెళ్లేందుకు సిద్ధమని చెప్పారు. రూ. 4 వేల కోట్ల విలువైన భూ వివాదంపై లోతుగా దర్యాప్తు చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా పాల్పడుతున్నారని తాను గతంలోనే చాలాసార్లు ఫిర్యాదు చేశానని ఆయన గుర్తు చేశారు. అక్కడ స్థానికంగా ఉంటున్న ఇంద్రనగర్ 70 ఏళ్ల క్రితం ఏర్పడిందని తెలిపారు. అక్కడ నివసిస్తున్న ప్రజల కోసం డ్రైనేజీ, రహదారుల సౌకర్యం కల్పించాలంటూ జీహెచ్ఎంసీ నుంచి గతంలో నిధులు తీసుకొచ్చానని వివరించారు. అయితే ఐడిపిఎల్ ఉద్యోగులను తాను బెదిరించాననేది పూర్తిగా అవాస్తవమని ప్రకటించారు. ఈ ఆరోపణలను తాను పూర్తిగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.. ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత మాధవరం కృష్ణారావుపై ఆరోపణలు చేశారు. ఈ వ్యాఖ్యలపై బుధవారం ఎమ్మెల్యే కృష్ణారావు కాస్త ఘాటుగా స్పందించారు. దాంతో ఎమ్మెల్యే కృష్ణారావుపై జాగృతి నేతలతోపాటు అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. ఆధారాలతో సహా అన్ని విషయాలు బయటపెడతానంటూ కవిత స్పష్టం చేశారు.

# సర్పంచ్ ఎన్నికను బహిష్కరించిన గ్రామస్థులు

కామారెడ్డి,డిసెంబర్11(వార్త వేదిక సూర్య): తెలంగాణలో తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ఉదయం 7 గంటలకు పోలింగ్ మొదలవగా.. మధ్యాహ్నం 1 గంటల వరకు ముగిసాయి. ఉదయం నుంచే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే పోలింగ్ నేపథ్యంలో పల్లెల్లో సందడి వాతావరణం నెలకొనగా కామారెడ్డిలోని ఓ గ్రామంలో మాత్రం ప్రజలు ఎన్నికలను బహిష్కరించారు. దీంతో ఆ గ్రామంలో సర్పంచ్ ఎన్నికకు బ్రేక్ పడినట్లైంది. జిల్లాలోని రామారెడ్డి మండలం చిన్న గోకుల్ తండా వాసులు ఎన్నికలను బహిష్కరించారు. తమకు సమాచారం ఇవ్వకుండా పెద్ద గోకుల్ తండా వాసులు సర్పంచ్ను ఏకగ్రీవం చేసుకున్నారని గ్రామస్తులు నిరసనకు దిగారు. పెద్ద గోకుల్ తండా వాసిని వేలం పాట ద్వారా ఏకగ్రీవం చేసుకున్నారని చిన్న గోకుల్ తండా వాసులు ఆరోపిస్తున్నారు. ఇందుకు నిరసనగా చిన్న గోకుల్ తండా వాసులు ఓట్లు వేయకుండా తండాల్లోనే ఉండిపోయారు. తమకు ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయలని వారు డిమాండ్ చేస్తున్నారు. మరి చిన్న గోకుల్ తండా వాసుల డిమాండ్ పట్ల అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY



# అఖండ-2 నుంచి శివశివ సాంగ్ విడుదల


## నేడు థియేటర్లలలో విడులకు సిద్ధం

## శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్న బోయపాటి

మరికొన్ని గంటల్లో 'అఖండ 2'తో థియేటర్‌లలో సందడి చేసేందుకు బాలకృష్ణ సిద్ధమయ్యారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా 12న శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈనేపథ్యంలో చిత్రబృందం ప్రచారం జోరు పెంచింది. తాజాగా ఇందులోని 'శివ శివ..' అంటూ సాగే ఎమోషనల్ ఆడియో సాంగ్‌ను విడుదల చేసింది. ఈ పాటకు కల్యాణ్ చక్రవర్తి లిరిక్స్ రాయగా.. కనకవ్వ, శ్రుతి రంజనీ ఆలపించారు.



ప్రస్తుతం తెలుగు సినీ ప్రేక్షకులంతా ఏ సినిమా కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 'అఖండ 2: తాండవం' చిత్రం డిసెంబర్ 5న విడుదల కావలసి ఉన్నా పలు కారణాల వలన వాయిదా పడింది. ఇక ఎట్టకేలకి డిసెంబర్ 12న రిలీజ్ కానుంది. బాలకృష్ణ- బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న ఈ సీక్వెల్‌కు అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయనే చెప్పాలి. విడుదల వాయిదా పడినప్పటికీ సినిమాపై ఉన్న క్రేజ్ మాత్రం రెండింతలు పెరిగింది. తాజాగా తెరుచుకున్న లిమిటెడ్ బుకింగ్స్‌తోనే అఖండ 2 ఏ రేంజ్‌లో ర్యాంపేజ్ చేస్తుందో స్పష్టమైంది. అనకాపల్లి నుంచి అమెరికా వరకు..ఎక్కడ చూసినా బాలయ్య సినిమాకే భారీ డిమాండ్. తెలుగు స్టేట్స్‌లో ఇంకా అన్ని షోలు ఓపెన్ కాకపోయినా, బుక్ మై షోలో లక్షల్లో టికెట్లు అమ్ముడైపోతున్నాయి.ఈ హడావిడి చూస్తుంటే ఆడియెన్స్‌లో ఉన్న మ్యాడ్నెస్ ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతోంది. పూర్తి స్థాయి బుకింగ్స్ ఓపెన్ కాకముందే అఖండ 2 భారీ టికెట్ సేల్ సాధించింది. పూర్తి బుకింగ్స్ ఓపెన్ చేయగానే రికార్డు ఓపెనింగ్స్ పక్కానే అని విశ్లేషకులు చెప్తున్నారు. ఈ భారీ యాక్షన్ డ్రామాలో సంయుక్తా మీనన్ హీరోయిన్ కాగా, హర్షాలీ మల్హోత్రా, ఆది పినిశెట్టి కీలక పాత్రల్లో నటించారు. థమన్ సంగీతం అందించారు. 14 రీల్స్ ప్లస్ నిర్మించిన ఈ చిత్రం బంపర్ హిట్ కొట్టడం ఖాయమే అంటున్నారు. 'అఖండ' లానే ఈ సీక్వెల్ కూడా థియేటర్లలో ఓ తాండవమే సృష్టించబోతోందని అభిమానులు నమ్ముతున్నారు. ఈ సందర్భంగా ఈ సినిమా దర్శకుడు బోయపాటి శ్రీను, సంగీత దర్శకుడు తమన్.. శ్రీశైల మల్లన్నను దర్శించుకున్నారు. సంబంధిత వీడియోను నిర్మాణ సంస్థ సోషల్ మీడియాలో పోస్టు చేసింది.



# దురంధర్‌పై హృతిక్ ప్రశంసలు

ఇటీవల విడుదలైన ధురంధర్ ప్రశంసలు అందుకుంటుంది. ఇప్పటికే పలువురు ప్రముఖులు ఈ చిత్రంపై రివ్యూ ఇవ్వగా తాజాగా హృతిక్ రోషన్ దీని గురించి మాట్లాడారు. అయితే, ఆయన వ్యాఖ్యలను కొందరు నెటిజన్లు తప్పుపడుతున్నారు. సినిమా చాలా బాగుందన్న హృతిక్ ఇందులో చూపించిన రాజకీయ అంశాలను తాను అంగీకరించనని అన్నారు. నాకు ఈ చిత్రం చాలా నచ్చింది. ఇంత గొప్ప కథను ప్రేక్షకులకు అందించినందుకు చిత్ర బృందానికి అభినందనలు. హృదయానికి హత్తుకునేలా దీన్ని తీర్చిదిద్దారు. కథను తెరకెక్కించిన విధానం మెప్పించింది. సినిమా అంటే ఇలా ఉండాలి అనిపించింది. ఇందులో చూపించిన రాజకీయపరమైన అంశాలను నేను అంగీకరించలేకపోతున్నా. కానీ, దర్శకులు కొన్ని విషయాలపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలి కాబట్టి అలా రూపొందించారని నేను భావిస్తున్నా. నేను ఈ చిత్రాన్ని ఆస్వాదించాను. దీనినుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను' అని హృతిక్ అన్నారు. ఇప్పుడీ కామెంట్స్ విమర్శలకు దారితీస్తున్నాయి. ధురంధర్‌లో కేవలం పాకిస్థాన్ ఉగ్రవాదుల క్రూరత్వాన్ని చూపారని, వారి భయంకరమైన దాడులను చూపారని ఆ విషయాలను ఎందుకు అంగీకరించలేక పోతున్నారని నటుడిపై విమర్శలు కురిపిస్తున్నారు. రణ్‌వీర్ సింగ్, మాధవన్, సంజయ్‌దత్, అక్షయ్ ఖన్నా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా మరోవైపు కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. డిసెంబర్ 5న విడుదలైన ఈ యాక్షన్ థ్రిల్లర్ ఇప్పటివరకూ రూ.180 కోట్లు వసూలు చేసింది. ఈ వారంలో రూ.200 కోట్లు వసూలు చేయవచ్చని అభిమానులు భావిస్తున్నారు.

# చిరుతలో రామ్‌చరణ్‌లా ఉన్న రోషన్ కనకాల

## మోగ్లీ ప్రీ రిలీజ్ వేడుకల్లో నటుడు రానా కితాబు

రోషన్ కనకాలను చూస్తుంటే తనకు 'చిరుత'లో రామ్ చరణ్‌ను చూసినట్లు ఉందని నటుడు రానా అన్నారు. రోషన్ కనకాల హీరోగా సందీప్ రాజ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మోగ్లీ 2025'. సాక్షి సాగర్ మడోల్కర్ కథానాయిక. డిసెంబర్ 13న విడుదల కానుంది. తాజాగా ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఆ వేడుకకు రానా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇదిలావుంటే రానా, విష్ణు విశాల్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'అరణ్య'. ప్రభు సాల్మన్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో అడవి, ఏనుగుల రక్షణ కోసం పాటుపడే వ్యక్తిగా రానా నటించారు. తాజాగా రానా ఆ సినిమా షూటింగ్ రోజులను గుర్తుచేసుకున్నారు. షూటింగ్ జరుగుతున్న ప్రదేశంలోకి ఏనుగుల గుంపు వచ్చిందని చెప్పారు. అరణ్య షూటింగ్ కోసం ఆరు నెలలు అడవిలో ఉన్నాం. మేము కొన్ని సన్నివేశాలను ఏనుగులు ఉండే ప్రాంతంలో చేశాం. సాయంత్రం సమయానికి వెళ్లిపోవాలి అన్నారు. అనుకున్న టైమ్‌కు మన షూటింగ్‌లు ఎప్పుడూ ముగించరని అందరికీ తెలిసిందే. దీంతో రాత్రి వరకూ అక్కడే ఉన్నాం. నేను సన్నివేశంలో భాగంగా దూరంగా ఉన్నాను. సడన్‌గా అందరూ గబగబా వెళ్లిపోతున్నారు. ఎందుకు ఇలా పరిగెడుతున్నారు అని చూసేసరికి ఏనుగులు మా వైపునకు వస్తున్నాయి. దీంతో నేను, మరికొంతమంది వాటికి కనిపించకుండా చెట్ల చాటుకు వెళ్లాం. కొంచెం కూడా శబ్దం చేయకుండా అలానే మూడు గంటలు ఉన్నాం. ఆ చిమ్మచీకట్లో అలా మూడు గంటలు ఉండడం ఎప్పటికీ మర్చిపోలేను. అడవి ఎంత



భయంకరంగా ఉంటుందో మొదటిసారి అప్పుడే అర్థమైంది అని రానా ఆ రోజులను గుర్తుచేసుకున్నారు. 'నేనే రాజు.. నేనే మంత్రి' తర్వాత రానా నటించిన సినిమా 'అరణ్య'. కొవిడ్ లాక్‌డౌన్ తర్వాత విడుదలైన తొలి పాన్ ఇండియా చిత్రం కూడా ఇదే. ఇందులో రానా ఫారెస్ట్ మేన్‌గా నటించారు. సందేశాత్మక చిత్రంగా ఆకట్టుకుంది.

## నాలుగు పతకాలతో

# గట్టి సమాధానం

టాలీవుడ్‌లో తల్లి, అత్త, అక్క, వదిన వంటి అనేక పాత్రల్లో నటించి ప్రేక్షకులను అలరించిన ప్రముఖ నటి ప్రగతి మరోసారి తన ప్రతిభతో, పట్టుదలతో అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. కరోనా తర్వాత సోషల్ మీడియాలో యాక్టివ్‌గా మారిన ప్రగతి, రీల్స్ ద్వారా, స్టెప్పులతో, పబ్లిక్ అప్పియరెన్స్‌లతో పెద్ద ఎత్తున పాపులారిటీ దక్కించుకుంటుంది. అయితే సోషల్ మీడియా సంచలనంగా మారిన ఈ నటి, తన వ్యక్తిగత జీవితంలో మాత్రం అసలు సిసలైన్ఫైటర్‌గా నిలుస్తోంది.కరోనా సమయంలో జిమ్ వర్కౌట్స్‌తో మొదలైన ప్రయాణం, నేడు ఆసియా లెవెల్ పతకాల వరకూ తీసుకెళ్తుందని ఎవరూ ఊహించలేదు. పవర్ లిఫ్టింగ్‌పై ఘనమైన పట్టు సాధించిన ప్రగతి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వరుసగా పతకాలు గెలుచుకుంటూ 50 ఏళ్ల వయసులో కూడా యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది. తాజాగా టర్కీలో జరిగిన అవార్డు ఫంక్షన్‌లో పాల్గొన్న ఆమె, నాలుగు పతకాలు సాధించి అందరు తలెత్తుకునేలా చేసింది. ఈ అద్భుత గెలుపుతో సోషల్ మీడియాలో ప్రగతి పేరు మారుమోగుతుండగా, సినీ ప్రముఖులు,



అభిమానులు, నెటిజన్లు అందరూ వరుసగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. గతంలో ప్రగతి జిమ్‌లో పెట్టిన ఫోటోలపై కొందరు నెటిజన్లు నెగటివ్ కామెంట్లు చేసిన సంగతి తెలిసిందే. జిమ్ డ్రెస్సింగ్‌పై, వయసుపై, వర్కౌట్‌పై వదిలిన టాక్సిక్ కామెంట్లకు ఆ సమయంలో ప్రగతి మౌనంగా ఉన్నప్పటికీ, తాజాగా త్రీ రోజెస్ సీజన్ 2 ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న ఆమె, ట్రోలర్స్‌కు ఘాటు సమాధానం ఇచ్చింది. కానీ ట్రోలర్స్‌కి నేను సాధించిన ఈ పతకాలే అసలైన సమాధానం.'అంతేకాక, తన విజయాన్ని ఇండస్ట్రీకి చెందిన అందరు మహిళలకు అంకితం చేస్తున్నాను అని తెలిపింది. ఆమె మాటలు ప్రతి ఒక్కరిని ఎంతగానో ఆకట్టుకున్నాయి.







# చిన్మయి మార్ఫింగ్ ఫోటోతో ట్రోల్

## గట్టిగా రిప్లై ఇస్తూనే ..పోలీసులకు ఫిర్యాదు

సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న దాడులకు సింగర్ చిన్మయి శ్రీపాద మరోసారి గట్టి సమాధానం ఇచ్చారు. మహిళల హక్కులు, భద్రత వంటి అంశాలపై గళమెత్తే చిన్మయి తరచూ ట్రోలింగ్‌కు గురయ్యే విషయం తెలిసిందే. అయితే ప్రతిసారి ధైర్యంగా స్పందిస్తూ, ట్రోలర్లను ఎదుర్కొనే తీరుతో ఆమె పలుమార్లు ప్రశంసలు పొందారు. తాజాగా ఆమెపై మార్ఫింగ్ ఫోటోలతో దాడి చేసిన వ్యక్తులపై చిన్మయి ఘాటుగా స్పందించి వీడియోను షేర్ చేశారు. చిన్మయి తన మార్ఫింగ్ చేసిన ఫోటోను, దాన్ని షేర్ చేసిన అకౌంట్ స్క్రీన్‌షాట్‌ను పోస్ట్ చేస్తూ,





వెంటనే పోలీసులకు కంప్లయింట్ చేసినట్లు తెలిపారు. గత 8-10 వారాలుగా కొంతమంది డబ్బులు తీసుకుని తనను, తన కుటుంబాన్ని అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని వీడియోలో పేర్కొన్నారు. ఈరోజు నాకు మార్ఫ్ చేసిన ఫోటో పంపించారు. వెంటనే పోలీసులకు ట్యాగ్ చేశాను. చట్టపరమైన చర్యలు తీసుకుంటారో లేదో ముఖ్యం కాదు. కానీ ఇలాంటి వ్యక్తులు అమ్మాయిలను, వారి కుటుంబాలను వేధించకుండా ఉండేందుకు ఈ వీడియో చేస్తున్నాను' అని ఆమె స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో 'ది గర్ల్ ఫ్రెండ్' మూవీ రిలీజ్ సమయంలో చిన్మయి, ఆమె భర్త రాహుల్ రవీంద్రన్‌పై నెటిజన్లు తీవ్ర విమర్శలు, అసభ్య కామెంట్లు చేశారు. రాహుల్ ..మంగళసూత్రం గురించి మాట్లాడిన పాత వీడియోను బయటకు తీసి, దారుణమైన పదజాలంతో దూషించారు. ఈ సందర్భంలో చిన్మయి మహిళల భద్రతపై వ్యాఖ్యానించడంతో మరింతగా ట్రోలింగ్ జరిగింది. దాంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్‌కు ఎక్స్ ద్వారా ఫిర్యాదు చేశారు.

ఇప్పుడు షేర్ చేసిన తాజా వీడియోలో కూడా చిన్మయి కొంతమంది నెటిజన్ల పేర్లు ప్రస్తావిస్తూ, 'పుట్టిన పిల్లలు చనిపోవాలని కోరుకునే ఇటువంటి అబ్బాయిలకు అమ్మాయిలను ఇచ్చి పెళ్లి చేయాలా?' అంటూ ప్రశ్నించారు.

# ఓటిటిలోకి 12ఏ రైల్వే కాలనీ'

అల్లరి నరేష్ నటించిన '12ఏ రైల్వే కాలనీ' సినిమా నవంబర్ 21న థియేటర్లలో విడుదలై పెద్దగా ఆడియన్స్‌ను ఆకట్టుకోలేకపోయింది. సూపర్ నేచురల్ థ్రిల్లర్ జానర్‌ను ఎంచుకున్న నరేష్ ఈ సినిమా ద్వారా విభిన్నమైన ప్రయోగం చేశాడు. నాని కసరగడ్డ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్ల హీరోయిన్‌గా నటించగా, కథను ప్రముఖ రచయిత, దర్శకుడు పొలిమేర అందించారు. టీజర్, ట్రైలర్ విడుదలైనప్పుడు ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. అల్లరి నరేష్ కామెడీ హీరో ఇమేజ్ నుంచి బయటకు వచ్చి సీరియస్ హారర్ జానర్‌లో అడుగుపెడుతుండటం కూడా ప్రత్యేక ఆకర్షణగా మారింది. అయితే సినిమా రిలీజ్ అయిన తర్వాత మాత్రం మిశ్రమ స్పందన వచ్చింది. కథనం రొటీన్‌గా ఉందని, హారర్ ఎలిమెంట్స్ కూడా పెద్దగా కనెక్ట్ కాలేదని ప్రేక్షకులు పేర్కొన్నారు. దీంతో చిత్రం బాక్సాఫీస్ వద్ద ప్రభావం చూపడంలో విఫలమైంది. బాక్సాఫీస్ కలెక్షన్లు ఆశించిన స్థాయికి చేరకపోవడంతో మేకర్స్ పెద్దగా గ్యాప్ లేకుండా ఈ సినిమాను ఓటిటీలోకి తీసుకువచ్చారు. ప్రముఖ డిజిటల్ ప్లాట్‌ఫారమ్ అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సినిమాకు ఓటిటీ హక్కులు దక్కించుకుంది.





Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**,and **Printed at SURYA DIGITAL PRINTERS,** H.No.132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252., and Published at H.No. 132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252. **Editor: POLOJU SRINIVASA CHARY. RNI No: TGTEL/25/A0305,** Cell:9985389183. **Email Id:vaarthavedhikasurya2025@gmail.com**